# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 100 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

14-02-2026 శనివారం వెల : 1/- పేజీలు : 4




## రోడ్డుపై చేసిన రంధ్రాలను మూసివేయరా?

**పండుగెల్లినా ఆలయ అధికారులకు సమయం చిక్కలేదా.?**

**ప్రజాప్రతినిధులైనా స్పందించి రోడ్డుపై రంధ్రాలును పూడ్చాలి**

**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్ర పండుగ రధసప్తమి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించామని చెప్పారు. రధసప్తమి ఉత్సవాల నిర్వహణలో భాగస్వామ్యులు అయిన వారందరికి విందు కూడా జిల్లా యంత్రాంగం అందించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సూర్య జయంతిని అధికారిక పండుగగా రాష్ట్ర పండుగను ప్రకటించి వివిద సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించింది. హెలికాప్టర్ తో స్ధానికులకు వినోధాన్ని కూడా పంచారు. రధసప్తమి రోజున కూడా అధికారులు ఊహించని రీతిలో భక్తులు తాకిడి ఎక్కువ అవ్వడంతో పాస్‌లన్నింటిని రద్దుచేశారు. అయితే దీనివెనుక కొందరు వ్యక్తులు పాస్‌లును ప్రింటింగ్ చేసినట్లు పెద్ద ఎత్తున వార్తలు రావడం, పోలీసులు చర్యలు చేపట్టడం తెలిసిందే. అధికారులు ఎంతగా శ్రమించిన పడవకు బొక్క పెట్టినట్లు ఇష్టారాజ్యంగా ప్రైవేట్ వ్యక్తులు పాస్‌లు ముద్రించడం వలన వేడకలో కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇవన్నీ పక్కన పెడితే రధసప్తమి వేడుక సమయంలో క్యూలైన్లు కోసం రోడ్డుపై గుండ్రని రంధ్రాలు చేసి వాటిలో కర్రలనుగానీ ,ఇనుపరాడ్‌లను పెడతారు. పండుగ అయ్యాక వాటిని శుభ్రంగా కప్పివేస్తారు. కానీ ఈ సంవత్సరం ఇంకా వాటిని కప్పలేదు.కారణాలు ఏమైనప్పటికీ అధికార యంత్రాంగం ఇప్పటి వరకు గుండ్రని రంధ్రాలను పూడ్చలేదు. ఇప్పటికైనా ఆ గుంతలను పూడ్చాలని స్ధానికులు కోరుతున్నారు.

## ఏ పేరైతేమీ ఏమున్నది గర్వకారణం..



- సచివాలయం గ్రామ, వార్డుల పేర్లు మార్పు...
- స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుగా కొత్త పేర్లు....
- 2019 అక్టోబర్ 2న ఏర్పాటు చేసిన గ్రామ మరియు వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు నుండి సచివాలయం అన్న పదము తొలగింపు...

**నవతరం టెక్కలి**

గత ప్రభుత్వంలో ఏర్పడిన ఈ సచివాలయ వ్యవస్థను మార్పులకు నేటి కూటమి ప్రభుత్వము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులను జారీ చేశారు. గ్రామ మరియు వార్డు సచివాలయ వ్యవస్థ పేర్లను స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డులుగా మార్చారు. గతంలో ఏర్పాటు చేసిన వ్యవస్థల ద్వారా ఆయా పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు అన్నింటిని వారి ఇంటి దగ్గరికి అందించిన విధానాన్ని నేటి కూటమి ప్రభుత్వము కూడా కొనసాగిస్తూ ఉన్నందున మాకు ఏ పేరు ఉంటే ఏమున్నది అని సుపరిపాలనను సాగిస్తూ ఆయా ఫలాలను అందిస్తూ ఉండాలని ప్రజల యొక్క భావనలు వ్యక్తపరిచారు.

## సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి

-ఎస్.టి.యూ.ఏ.పి డిమాండ్



**నవతరం -విశాఖపట్నం**

విశాఖపట్నం సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయుల కు టెట్ రద్దు చేయాలని, జాతీయ విద్యా విధానంలో పలు మార్పులు తీసుకురావాలని ఎస్.టి.యూ.ఏపీ విశాఖపట్నం శాఖ అధ్యక్షులు చంద్ర పద్మావతి డిమాండ్ చేశారు.

-మిగతా 2లో

## శ్రీకాకుళం యువ చిత్రదర్శకుడు వుట్ల వీరభద్రకు ఉత్తమ షార్ట్ ఫిల్మ్ అవార్డు

దుబాయ్‌లో తన చిత్రాల ప్రదర్శనకు అవకాశం



2లో

## మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్టు చెయ్యడం అన్యాయం



జైల్ లో అంబటి రాంబాబుతో ములాఖాత్ 2లో

## అస్థిత్వాన్ని చాటుకున్న ప్రసార సాధనం రేడియో



4లో

## రాష్ట్ర బడ్జెట్లో ఉద్ధానానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- ఆఫ్ షోర్ ప్రాజెక్ట్.. నువ్వల రేవు ఫిషింగ్ హార్బర్, డాక్టర్ వైయస్సార్ సుజల దార త్రాగునీరు ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలి
- వైఎస్ఆర్‌పి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు

4లో



ఎడిటోరియల్


# నవ్విపోదురుగాక..!

భారతరత్న.. ఇది దేశ ప్రతిష్ఠాత్మక అవార్డు. స్వాతంత్ర్య పోరాటానికి, ప్రజాస్వామ్య విలువలకు, సమానత్వానికి తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయులకు అందించే గొప్ప గౌరవం. అలాంటి ప్రాధాన్యతగల అవార్డును తమ రాజకీయ అజెండాకు తగినట్టు మలచుకోవడం సిగ్గుచేటయిన విషయం. మహారాష్ట్రలోని ముంబైలో ఆదివారం నిర్వహించిన సంఘ్-శతాబ్ది ఉత్సవాల్లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు 'పరివారం' ప్రమాదకర ఆలోచనలకు అద్దంపట్టే ధోరణికి సంకేతాలు. 'సావర్కర్‌కు భారతరత్న ఇస్తే, దాని ప్రతిష్ట పెరుగుతుందని' చెప్పడం స్వాతంత్రోద్యమ చరిత్రను తిరగరాయలన్న ఆరెస్సెస్ ప్రాజెక్టులో ఓ భాగం! అంతేకాదు, హిందూ అనే పదం పురాణాల్లో లేదని, విదేశాల నుంచి వచ్చిందని ఆలస్యంగానైనా వ్యక్తపరచడం, దీనివెనుక 'మతలబు' కూడా గ్రహించాల్సిన అంశం. ఎందు కంటే, భగవత్ చెప్పిన మాటలు అను కోకుండా వచ్చినవి కాదు, సంఘ్ రాజకీయ వ్యూహంలో రూపుదిద్దుకున్న అభిప్రాయాలు!

ఈ దేశపు లౌకికవనంలో విద్వేషపు కలుపు సావర్కర్. బ్రిటీష్ పాలకులకు ఆయన రాసిన క్షమాపణ పత్రం స్వాతంత్ర్యం కోసం మడమ తిప్పక పోరాడినవారి ఆశయాలకు విరుద్ధం. జైలులో ఉండి కూడా పోరాటాన్ని కొన సాగించిన విప్లవకారులు, జాతీయ నాయకులతో పోల్చినప్పుడు ఆయన రాజకీయ వైఖరి, 'సర్దుబాటు, సహకారం' వైపే మొగ్గింది. 'నన్ను విడిచి పెట్టండి.. యువతను జాతీయోద్యమంలోకి రాకుండా చూస్తాను' అని 'తెల్ల దొరలకు' బానిసగా మారినవాడు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి నేతలు దేశాన్ని పౌరసత్వం, సమానత్వం, లౌకికతత్వంపై నిర్మించాలని కోరితే, సవార్కర్ దృష్టి 'సాంస్కృతిక ఏకత్వం' పేరుతో మతాధిత్యంవైపు వెళ్లింది. ఇలాంటి నాయకునికి భారతరత్న కట్టబెట్టే ఆలోచనను సంఘ్ చేస్తుందంటేనే 'మరోకుట్ర'కు తెరదీసిందని అర్థం! బ్రిటీష్‌వారితో 'రాజీ'పడి ప్రజల్లో విభజన సృష్టించిన వ్యక్తిని భగవత్ 'ఆ స్థాయికి' ఎత్తడం, పైగా ఆయనకు అవార్డు ఇవ్వడం వల్ల దాని ప్రతిష్ట పెరుగుతుందని చెప్పడం ఆ..ఆలోచనల వెనుక దాగిన 'ఆరెస్సెస్ ఎజెండా' ఏమిటో స్పష్టం. ఇది త్యాగాన్ని కాదు, విధేయతను దేశభక్తిగా నిర్వచిస్తోంది. అధికారాన్ని ఎదిరించడం, పోరాడటం దేశద్రోహంగా చిత్రిస్తోంది. పాలకులకు దాసోహపడటం దేశసేవగా ప్రజల మనసుల్లో నాటుతోంది. నేడు భారతరత్న చర్చను తీసుకు రావడం కూడా యాదృచ్ఛికమేమి కాదు. స్వాతంత్ర్య పోరాట చరిత్రను చిన్నగా చేయడం, గాంధీహత్య వంటి సంఘటనల చుట్టూ ఉన్న భావజాల బాధ్యతను పక్కకు నెట్టడం, హిందుత్వాన్ని 'జాతీయత'గా మలచడం, ఇవన్నీ.. ఒకేశ్రేణిలో కనిపించే దృశ్యాలు. అసలు ఏ అర్హత ప్రాతిపదికన సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలన్నది కూడా ప్రశ్నే. ఇప్పటివరకు ఈ అవార్డు పొందినవారు కేవలం గొప్పవ్యక్తులే కాదు, వారు దేశానికి దశ, దిశ చూపినవారు. శాస్త్రీయ విజ్ఞానం, ప్రజాసేవ కోసం పాటుపడిన వారు. ప్రజల్లో రగులుతున్న స్వాతంత్ర్యపు బలమైన కాంక్షను ఉద్యమంగా మల్లించినవారు, సామాజిక న్యాయానికి పోరాడినవారు. ఎన్నో ఏండ్లపాటు జైలుశిక్షలు అనుభవించినవారు.

నేటికీ ప్రజల గుండెల్లో వీరులెవరైనా ఉన్నారంటే ఉరికొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్, యువతశక్తి నిర్వీర్యం కాకుండా స్వాతంత్ర్య ప్రేరణకు ఉపయోగించిన నేతాజీ, ఇంకా చరిత్రలో ఎంతోమంది. అందుకే ఒక్కసారి మనం కొన్ని విషయాలను గుర్తుతెచ్చుకోవాలి. భగత్‌సింగ్ జైలులో ఉన్నప్పుడు తండ్రి తీసుకొచ్చిన క్షమాపణ లేఖను చూసి భగత్‌సింగ్ అన్న మాటలు నేటికీ దేశం కళ్లముందు సాక్షాత్కరిస్తూనే ఉంటాయి. "బానిసత్వంలో బతకడం కన్నా, స్వేచ్ఛ కోసం చావడమే గౌరవం" అది ఒకమాట కాదు, ఒక చైతన్యపు గర్జన. అదే సావర్కర్ మాత్రం బ్రిటీష్ పాలకులకు క్షమాపణలు రాసి, 'విదేయత హామీ'లతో బయటపడ్డాడు. ఒకరేమో జైలును విప్లవ పాఠశాలగా మార్చుకుంటే, మరొకరు ఏకంగా దేశ ఆత్మగౌరవాన్నే తాకట్టు పెట్టాడు. నిజమైన పోరాటవీరులో ఇక్కడే తెలుస్తోంది. భారతరత్న గౌరవం ఎవరికి దక్కాలి? ప్రజల్ని ఏకం చేసిన సమానత్వపు సిద్ధాంతానికా? విభజనకు దారి తీసిన భావజాలానికా? భగవత్ మాటల వెనుక ఉన్నదంతా కూడా అధికారానికి ఎదురు తిరగకుండా ఉండే బానిస విధానం. ప్రశ్నించేతత్వాన్ని ప్రమాదకరంగా, తిరుగుబాటును అప్రయోజనంగా, యువతను నిరసనల నుంచి దూరం చేయడం, ఇది రాజకీయ లొంగుబాటులోని ఆరెస్సెస్ క్రమం. భగవత్ వ్యాఖ్యలు రానురానూ 'దేశభక్తి' చర్చను ముందుకు తెచ్చి ప్రజాగ్రహాన్ని మళ్లించడం. అందుకే, ఈ అవార్డు విలువల కేంద్రంగా కాకుండా, రాజకీయ 'ఆయుధం'గా మారితే గనుక, స్వాతంత్ర్య పోరాట చరిత్రకు ఇంతకన్నా వేరే ద్రోహమేమి ఉండదు.

# పిట్టల పొట్టలు నింపుదాం రండి..!



ఆహా...
ఇంద్రధనుస్సు
నేలపైకి దిగివచ్చినట్టు
ఈ పిట్ట పరవళ్ళుతొక్కే
రంగుల జలపాతంలా ఉంది

ప్రకృతి కట్టిన చిలకపచ్చ చీరపై
దైవం గీసిన చిత్రంలా ఉంది
దాని రెక్కలు వెలుగే వర్ణచిత్రాల విందు.

పుష్పాల మధ్య పొదిగిన రత్నంలా
దాని చూపు ఉదయ తారక వెలుగు.

కానీ...బంగారుగిన్నె
ఖాళీగా మోగినట్టు
దాని చిన్నిపొట్ట ఆకలితో
నకనకలాడుతుంది.
సూర్యుడు ఉదయం
వెలిగిన దీపంలా
తూర్పున తొంగిచూస్తే
పాపం పిట్ట తిండి కోసం
ఆకలి వేట ప్రారంభించింది

గింజల కోసం గాలిలో గాలిపటంలా
నింగిలో ఎగిరి ఎగిరి తిరిగి తిరిగి
చివరికి అలసిన యాత్రికునిలా
కొమ్మపై కూర్చుంది
ఆకలితీర్చే అన్నదాతల కోసం
పాలకోసం పసిబిడ్డ తల్లివైపు
చూసినట్టు ఎదురు చూస్తోంది

అందుకే ఓ మానవా...
నీ పిడికెడు బియ్యం
చంద్రకిరణంలా జారితే
పది పిట్టల పొట్టలు
పండుగ దీపాల్లా వెలుగుతాయి.

పిల్లికి బిక్షం పెట్టని
పిసినారి హృదయం
కరగని కురవని నీలిమేఘమే...
కోట్లున్నా దానధర్మం లేని జీవితం
పువ్వులేని వసంతంలా నిర్జీవమే...

పశుపక్ష్యాదులను
ఆదరించే మనసు గంగలా పవిత్రం
గోవింద నామంలా పరమ పావనం

నేడు ఇష్టంతో ఇచ్చిన గింజ
రేపు విత్తనమై వృక్షంలా ఫలిస్తుంది

కరుణను విత్తిన చేయి కల్పవృక్షంలా
రేపు వరాల వర్షం కురిపిస్తుంది

అందుకే రండి...
మన గడప ముందర గింజలు చల్లి
మన ఎదలో దయాదీపం వెలిగిద్దాం

పిట్టల పొట్టలు నింపిన ప్రతి క్షణం
ఆ పరమాత్మ పాదారవిందాలకు
సమర్పించిన పుష్పంలా పుణ్యఫలం



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్టు చెయ్యడం అన్యాయం

నవతరం -రాజా మహేంద్రవరం

మాజీ మంత్రి అంబటి రాంబాబు ని అరెస్టు చెయ్యడం అన్యాయమని ఆయన్ను జైల్ లో పెట్టడం కక్ష సాధింపు చర్య అని మాజీ స్పీకర్ శ్రీకాకుళం వైఎస్ఆర్ పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు రాజమహేంద్రవరం సెంటర్ జైల్లో రిమాండ్ లో ఉన్న అంబటి రాంబాబు తో మాజీ స్పీకర్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం శుక్రవారం ములకత్ అయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ మీరు ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన ఎన్ని రోజులు జైల్లో పెట్టిన కడిగిన ముత్యంలా ఆయన తిరిగి వస్తారని ఈ సందర్భంగా ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కళింగ కుల మాజీ అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి దుంపల లక్ష్మణరావు రాష్ట్ర ఇంటలెక్చువల్ కార్యదర్శి పిల్లల రామకృష్ణ హెచ్చర్ల జడ్పీటీసీ సనపల నారాయణరావు కొత్తూరు మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం ఉదయం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్.టి.యూ.ఏ.పీ) విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో జీవీఎంసీ ఎదురుగా గాంధీజీ విగ్రహం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.టి.యు జిల్లా సంఘ అధ్యక్షులు చంద్ర పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య, ఉపాధ్యాయులు సరళతరంగా, సులభతరంగా బోధనా తరగతులు నిర్వహించేలా పలు చర్యలు తీసుకోవటం వంటివి స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ జాతీయ విద్యా విధానంలో పలుమార్పులు తీసుకువచ్చేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సులు చేయాలన్నారు.
కొత్త సిపిఎస్ ను రద్దు చేస్తూ..పాత ఓపిఎస్ ను అమలు చేయాలని ఆమె కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని కోరారు. కార్యదర్శి ఇమంది రాజు మాట్లాడుతూ టీచర్లకు పెండింగ్ డిఏ లు మంజూరు చేయాలని, ఆర్థిక బకాయిల చెల్లించాలని కోరారు.
సకాలంలో పెన్షన్ సౌలభ్యాల చెల్లింపు కూడా జరపాలన్నారు. మూడవ దశ పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు . ధర్నా శిబిరంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు డా.ఎం.ఆర్.ఎన్ . వర్మ, రాష్ట్ర హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష , కార్యదర్శి కృష్ణ కుమార్, వేణుగోపాల్. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల రమణ పాల్గొని సంఘీభావం తెలిపారు. చట్టం చేసే వారిని, చట్టం అమలు చేసే వారిని టీచర్లు సుద్ద పప్పులు గా పంపలేదు, మారిన అవసరాలకు అనుగుణంగా కొత్త సానుకూల చట్టాలు తీసుకురావాల్సింది పోయి, ఉన్న చట్టాలు తొలగించడం విచారకరం అన్నారు.
టీచర్ల న్యాయబద్ధమైన డిమాండ్లను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. టి. యూ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోటీతత్వంతో మహిళలు రాణించాలి

నవతరం -శ్రీకాకుళం



పోటీ తత్వంతో మహిళలు రాణించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. విశాఖ-బి కాలనీ మహిళలకు నిర్వహించిన ముగ్గులు పోటీలో విజేతలకు కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్ట్ తరపున సర్టిఫికెట్లను గురువారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ విశాఖ-బి కాలనీలో మహిళలు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ వివిధ పోటీల్లోనూ రాణిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వహించిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ డాక్టర్ రమేష్‌చంద్రసాహూ మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించుకోవడంతోపాటు ప్రజాప్రతినిధులు సహకారంతో సామాజిక భవనం ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. రిటైర్డ్ హెచ్.ఎం మూకల్ల చిన్నయ్యమాస్టారు మాట్లాడుతూ సమైక్యంగా ఉండడం వల్లే కాలనీ అభివృద్ధి చేసుకోగలుగుతున్నామన్నారు. తొలుత చిన్నయ్య మాస్టర్ 75 జన్మదిన వేడుకల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఎస్.వి.రమేష్, కె.రమేష్, వికాస వేదిక కన్వీనర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం యువ చిత్రదర్శకుడు వుట్ల వీరభద్రకు ఉత్తమ షార్ట్ ఫిల్మ్ అవార్డు

నవతరం -శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువ చిత్రదర్శకుడు వుట్ల వీరభద్ర షార్ట్ ఫిల్మ్ మరియు రీల్ పోటీ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచి గొప్ప గుర్తింపును సాధించారు. ఈ పోటీని Blue Ribbon Overseas Consultancies విశాఖపట్నంలో నిర్వహించింది.
ఈ పోటీకి సుమారు 600 షార్ట్ ఫిల్మ్ మరియు రీల్స్ వచ్చాయి. వీటిలో నుంచి కేవలం 10 ఉత్తమ కృతులను ఎంపిక చేయగా, అందులో వుట్ల వీరభద్ర దర్శకత్వం వహించిన మూడు కృతులు (రెండు షార్ట్ ఫిల్మ్ మరియు ఒక రీల్) చోటు దక్కించుకోవడం విశేషం.
ఈ ప్రతిభకు గాను వుట్ల వీరభద్రకు ఉత్తమ షార్ట్ ఫిల్మ్ అవార్డును బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ కన్సల్టెన్సీస్ సంస్థ సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సంతోష్ కుమార్ చేతుల మీదుగా విశాఖపట్నంలోనీ ఫార్చ్యూన్ హోటల్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించి, విశాలమైన అవార్డును ప్రదానం చేశారు. కథన నిర్మాణం, దర్శకత్వ ప్రతిభ మరియు విజువల్ ప్రదర్శనలో చూపిన నైపుణ్యానికి ఈ గుర్తింపు లభించింది.
ఇంకా ప్రత్యేకంగా, బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ కన్సల్టెన్సీస్ సంస్థ ఆయనకు దుబాయ్ వెళ్లి తన షార్ట్ ఫిల్మ్‌ను అక్కడి తెలుగు సంఘాలు మరియు తెలుగు ప్రేక్షకుల ముందు ప్రదర్శించే అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా ఆయనను ఎదుగుతున్న తెలుగు చిత్రదర్శకుడిగా పరిచయం చేయనున్నారు.
ఈ సందర్భంలో వుట్ల వీరభద్ర మాట్లాడుతూ, తన దర్శకత్వ ప్రయాణంలో ఈ గుర్తింపు ఎంతో ఆనందాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తోందని, దుబాయ్ వేదికపై తన చిత్రాలను ప్రదర్శించడం గర్వకారణంగా భావిస్తున్నానని తెలిపారు.
ఈ విజయం గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న యువ చిత్రదర్శకులకు స్ఫూర్తిగా నిలుస్తూ, కృషి మరియు నిబద్ధత ఉంటే అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు సాధ్యమని చాటుతోంది.

# ఓం నమశ్శివాయ......
# ఏకబిల్వం శివార్పణం!



కలియుగంలో శివపూజ చాలా శ్రేష్టమైనది. విశిష్టమైనదీనూ. 'శివ' అనే రెండక్షరాల పదం పాపాలను పొగొట్టి మోక్షాన్ని ప్రసాదిస్తుంది. దుఃఖభూయిష్టమైన మానవ జీవితానికి తరుణోపాయమే 'శివ' శబ్దం. 'శి' అనగా మంగళవాచకం. 'వ'కారము దాతృవచనము. యే దైవము మంగళప్రదాయమో ఆయననే 'శివుడు' అని కీర్తించిరి. ఎవరు విశ్వమునందు గల సకల ప్రాణులకు 'శం' కళ్యాణము నొసంగునో ఆయననే శంకరుడు. మోక్షమును ప్రసాదించు దైవమునే శంకరుడనిరి. 'శివరాత్రి' అంటే శుభకరమైన, మంగళప్రదమైన రాత్రి అని అర్థం. ఈ సకల చరాచర సృష్టికి మూలరూపం శివలింగమే. ఈ సృష్టియంతా లింగములోనే లయమై ఇమిడి ఉన్నదని ఆర్యోక్తి. శివుడు శుభప్రదుడు మాఘ బహుళ చతుర్దశి రోజున అర్ధరాత్రి లింగోధ్భవ కాలంలో మారేడు దళములతో, బిల్వదళములతో శివలింగ అభిషేకార్చన దరిద్రము నశింపచేసి సకల కోర్కెలను నొసంగును.

శివప్రీతికరమైన బిల్వము జగన్మాత ఉమాదేవి స్వరూపమే. కనుక అజ్ఞానమనెడి చీకటిని బ్రద్దలు చేయునది. బిల్వము సాక్షాత్తూ శివ స్వరూపమే. లక్ష్మీప్రియమును, జ్ఞానప్రదమును దారిద్ర్యనాశనము అగు బిల్వవృక్షమును అర్చించువారు భాగ్యవంతులవుదురు. నిత్యం శివలింగమును బిల్వదళములతో పూజించు వారికి సకల పురుషార్థములు పొందెదరు.

ఈ బిల్వ వ్రతాలలో, ఏకబిల్వము, త్రిబిల్వము, పంచబిల్వము అని మూడు రకాలుగా ఉంటాయి. సత్వరజస్తమో గుణముల వల్ల కలిగే బాధలను పోగొట్టి, బ్రహ్మ హత్యాది దోషములను నశింపచేసి, శివానుగ్రహంను కలిగించేవి బిల్వ పత్రములని ఇతిహాస, పురాణాలు పేర్కొంటున్నాయి. బిల్వవృక్షం దేవతలచే పూజలందుచూ 'శ్రీవృక్షము' అని పేరుగాంచినది. బిల్వపత్రాలు లేనిదే శివపూజ పూర్తికాదు. లక్ష్మీదేవికి మారేడు చెట్టు నిలయం. అందుకే లక్ష్మీదేవిని 'బిల్వ నిలయా' అని పిలువబడుతున్న బిల్వం వేదకాలంనుండే పవిత్రమైందిగా అవగతమవుతుంది. ఈ వృక్షాన్ని సాధారణంగా అన్ని శివాలయాలలో పెంచుతారు. త్రిదళ పత్రాలు కలిగిన ఈ ఆకులు సువాసనా భరితంగా ఉంటాయి. బిల్వ వృక్షంలో ఎన్నో ఔషద గుణాలున్నాయి. జ్ఞానాన్ని వృద్ధి పరచి, మానవుల శారీరక, మానసిక దోషాలను దూరం చేసి, దుర్వాసన పొగొట్టడంలోనూ, సౌందర్యపోషణకు ఉపయోగపడడమే కాకుండా శరీరంలో గల విషపదార్థాలను నిర్మూలిస్తుంది. వాతావరణ సమతౌల్యానికి దోహదం చేయడం, ఆధ్యాత్మికత, ఔషధ విలువలతో కూడుకొని మానవ కల్యాణానికి తోడ్పడుతుంది. అన్ని పత్రములలోనూ బిల్వ పత్రము సర్వోత్తమైనది. బిల్వదళ జలముతో శివార్చన భోగభాగ్యములు లభించును. ఎవరేని ఒక్కసారి బిల్వపత్రములచే శివునర్పింతురో వారు. మహాపాతక ముక్తులై శివసాన్నిధ్యం పొందెదరు. శివుని బిల్వ పత్రములతో అర్చించితే. పదివేల యజ్ఞములు చేసిన ఫలం కలుగుతుందట.

బిల్వాన్ని దర్శించినా, స్పర్శించినా, సర్వ పాపములు ఈ జన్మ, గత జన్మలలో చేసిన ఘోరాతి ఘోర పాపములు సైతం ఒక్క బిల్వదళము శివలింగముపై నుంచిన కైవల్యము ప్రసాదించును. బిల్వ వృక్షము మహా మహిమాన్వితమైది. శివప్రీతికరమై బిల్వము అత్యంత పవిత్రమైనది. శివలింగముపై బిల్వమును అదోముఖంగా పూజించాలి. ఏవిధంగా పుట్టునో ఆ తీరుగానే పూజించరాదు. అంటే బిల్వాన్ని తృంచి బోర్లగా శివలింగంపై పెట్టాలి. బిల్వదళాలు 40 రోజుల వరకు పనికివచ్చును, అందుబాటులో లేని వారు. ఒక మారు తృంచిన బిల్వాలను రోజు శుభ్రపరచి మండలం రోజులు వాడవచ్చును. భక్తితో ఒకటిగాని, మూడుగాని, ఐదుగాని, పదకొండుగానీ, సహస్రముగానీ, బిల్వదళములతో శివుని భక్తి భావంతో పూజించిన, సర్వరోగాలు నశించి, సర్వదుష్టగ్రహాలు తొలుగుతాయని వచనం. ఉదయం బిల్వమును దర్శించి, ప్రదక్షిణంచేసి మాఘ బహుళ చతుర్ధశి మహాశివరాత్రి పర్వదినాన అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో శివలింగాన్ని దర్శించి, అభిషేకించి లింగార్చన చేసి, బిల్వతీర్థం పుచ్చుకుంటే మోక్షప్రదం. సర్వపాపనాశనము. బిల్వదళములతో శివపూజ చేసినవారికి తిరిగి జన్మ లేదని పురాణోక్తి. బిల్వ పత్రములు లభించినప్పుడు ఆ చెట్టు క్రిందనున్న పవిత్రమైన మృత్తిక (మట్టి)తోనైనా కస్తూరి పాడివలె శివుని పూజింపవచ్చునని శాస్త్ర ప్రమాణము.


బిల్వమూలమున, శివ పంచాక్షరి జపం చేస్తే శీఘ్రముగా మంత్రసిద్ధి కలుగుతుందని, త్రిదళములు బిల్వములచే పరమశివుని ఆరాధనవల్ల శివసాయుజ్యం పొందుతారని, జన్మ జన్మల్లో చేసిన పాపాలు సంహరించునదైన ఒక బిల్వపత్ర దళము శివార్పణ మగును గాక !

ఓం నమశ్శివాయ.




" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు


## సైనిక సంక్షేమానికి అండగా 'యోగ' రామారావు
### సైనిక సంక్షేమ నిధికి రూ. లక్ష విరాళం



**నవతరం- శ్రీకాకుళం**

భరతమాత ముద్దుబిడ్డలైన దేశ రక్షకుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యోగా గురువు, రామారావు ఉచిత గురుకుల సంస్థ (హైదరాబాద్) సహకారంతో 'సైనిక సంక్షేమ నిధి'కి ప్రకటించిన లక్ష రూపాయల చెక్కును శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ చేతుల మీదగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ కి అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు, గాయపడిన సైనికుల పిల్లల ఉన్నత చదువులకు ఈ నిధి ఎంతో తోడ్పడుతుందన్నారు. రామారావు సేవలు స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది బైరి మురళి పాల్గొన్నారు.



## కొత్త హీరోయిన్ కు మరో బంపరాఫర్?

హీరోయిన్ గా ఎదగడం చాలా కష్టం. స్టార్ స్టేటస్ తెచ్చుకోవడం ఇంకా కష్టం. ఇలాంటివన్నీ చాలా చులాగ్గా అయిపోతున్నాయి ఇమాన్వి విషయంలో. టాలీవుడ్ లో అడుగుపెట్టడమే ప్రభాస్ మూవీతో ఎంట్రీ ఇస్తోంది, ఇప్పుడు తన రెండో సినిమాకు మరో బంపరాఫర్ అందుకునేలా ఉంది.

ప్రభాస్ హీరోగా ఫౌజీ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్ గా యూట్యూబ్ సెన్సేషన్ ఇమాన్విని తీసుకున్నారు. తెలుగులో ఆమెకు ఇదే తొలి సినిమా. ఆ మాటకొస్తే హీరోయిన్ గా ఇదే మొదటి సినిమా. అలా తొలి సినిమాకే ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ సరసన నటించే అవకాశం అందుకున్న ఇమాన్వి, ఇప్పుడు పవన్ కల్యాణ్ సినిమాలో నటించే అవకాశానికి అడుగు దూరంలో నిలిచింది.

సురేందర్ రెడ్డి దర్శకత్వంలో త్వరలోనే సెట్స్ పైకి వెళ్లబోతున్నారు పవన్ కల్యాణ్. ఈ సినిమాలో హీరోయిన్ గా ఇమాన్వి పేరును పరిశీలిస్తున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఇమాన్వి, మరో బిగ్ స్టార్ సరసన నటించడం ఖాయం.

పవన్ సినిమాలో ఏ హీరోయిన్ నటించినా, బల్క్ గా కాల్షీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. పవన్ పొలిటికల్ షెడ్యూల్స్ కు తగ్గట్టు, ఎప్పుడు పిలిస్తే అప్పుడు సెట్స్ పైకి రావాల్సి ఉంటుంది. ఇమాన్వి లాంటి కొత్త హీరోయిన్ అయితే కాల్షీట్ల సమస్య ఉండదని మేకర్స్ భావిస్తున్నారు.

ఈ సినిమాను మార్చిలో అధికారికంగా ప్రారంభిస్తారు. ఏప్రిల్ నుంచి పవన్ మళ్లీ సెట్స్ పైకి రానున్నారు. ప్రతి నెల కొన్ని రోజుల పాటు కాల్షీట్లు ఇచ్చి ఈ సినిమాకు పూర్తిచేయాలని అనుకుంటున్నారు. అలా 6-7 నెలల్లో సినిమాను కంప్లీట్ చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నారు.

## వాలంటైన్స్ వీకెండ్.. మూవీ ఎట్రాక్షన్స్ ఇవే

ఇది మామూలు వీకెండ్ కాదు. వాలంటైన్స్ డే వీకెండ్. యూత్ కు కచ్చితంగా ప్రత్యేకం. అందుకే బాక్సాఫీస్ కూడా వాలంటైన్స్ కోసమే అన్నట్టు రెడీ అయింది. ఈ వారాంతం కపుల్ ఫ్రెండ్లీ, ఫంకీ, సీతా పయనం సినిమాలొస్తున్నాయి. ఇవన్నీ యూత్ సినిమాలే. మరీ ముఖ్యంగా కపుల్ ఫ్రెండ్లీ, సీతా పయనం సినిమాలు రొమాంటిక్ మూవీస్.



లాంగ్ గ్యాప్ తర్వాత సంతోష్ శోభన్ నుంచి వస్తున్న సినిమా కపుల్ ఫ్రెండ్లీ. మానస వారణాసి హీరోయిన్ గా నటించిన ఈ సినిమా పెద్దగా అంచనాల్లేకుండా థియేటర్లలోకి వస్తోంది. అయితే తాజాగా వచ్చిన ట్రయిలర్ అందర్నీ ఆకర్షించడంతో అంచనాలు పెరిగాయి.

ఇక ఫంకీ సంగతి అందరికీ తెలిసిందే. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో, విశ్వక్ సేన్ హీరోగా నటించిన సినిమా. వరుస పరాజయాల నేపథ్యంలో విశ్వక్ చేసిన ఈ సినిమా కూడా పెద్దగా అంచనాల్లేకుండానే వస్తోంది. కామెడీ ఓ రేంజ్ లో క్లిక్ అయితే, మరో 'జాతిరత్నం' అవుతుంది.

పూర్తిగా వాలంటైన్స్ డే ఫీవర్ ను బేస్ చేసుకొని వస్తున్న సినిమా సీతాపయనం. అర్జున్ దర్శకనిర్మాతగా, ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ లీడ్ రోల్ లో నటించిన ఈ సినిమా ఇది. ప్రేమికులతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ అంతా తప్పక చూడాల్సిన సినిమా అంటున్నారు అర్జున్.

ఈ సినిమాలతో పాటు 2 రీ-రిలీజ్ లు కూడా ప్రేమికుల కోసం సిద్ధమయ్యాయి. అవే లవ్ స్టోరీ, మనసంతా నువ్వే. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన లవ్ స్టోరీని వాలంటైన్స్ డే స్పెషల్ గా లిమిటెడ్ స్క్రీన్స్ లో రీ-రిలీజ్ చేస్తున్నారు. అటు ఉదయ్ కిరణ్ నటించిన మనసంతా నువ్వే సినిమా కూడా రీ-రిలీజ్ అవుతోంది.

# థాంక్యూ సీఎం సార్ 108 ఉద్యోగులు




**నవతరం-టెక్కలి**

థాంక్యూ సీఎం సార్ అంటున్న టెక్కలి 108 ఉద్యోగులు.. ఏపీ 108 అంబులెన్స్ సర్వీస్ లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈ.యం.టి మరియు పైలెట్ లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అప్పటికే ఉన్న ఉద్యోగి యొక్క జీతం కు అదనంగా నెలకు 2000 రూపాయలను పెంచడం తో బాటు,5,10 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొన్న ఉద్యోగులకు ఆటోమేటిక్ స్లాబ్ అప్గ్రేడేషన్ చేయవలెనని నిర్ణయించడం ద్వారా వారికి మరింత ఆర్థిక వెసులుబాటును అందించారు. 108 అంబులెన్స్ ఉద్యోగులకు అందించిన ఆర్థిక పెంపుదలను టెక్కలి 108 ఉద్యోగులు అయిన ఈ.యం.టి మరియు పైలెట్లు అందరూ హర్షిస్తున్నారు. ఈ నెల నుండి స్లాబ్ అప్గ్రేడ్ చేసిన జీతాలు చేతికి అందడం తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అందరూ ఆంధ్రప్రదేశ్ 108 సర్వీస్లో ఏకైక సంఘం అయిన ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్-138 సిఐటియు అనుబంధం) ఉద్యోగ సంఘం ద్వారా "థాంక్యూ సీఎం సార్" మరియు "థాంక్యూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్" అనే పాంప్లేట్ లను విధులు నిర్వహించే వాహనం ముందు ప్రదర్శిస్తూ వారికి ధన్యవాదాలు తెలియపరిచారు..

ఈ సందర్భంగా మేము చేస్తున్న విధినిర్వహణలో మరింత మెరుగైన సేవలు ఆపదలో ఉన్నవారికి అందించి ప్రభుత్వానికి మరియు భవ్య కంపెనీ వారికి మంచి పేరును తీసుకువస్తామని ఇందుమూలంగా తెలియజేశారు.

# డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ క్రెడిబిలిటీని దెబ్బతీయడం తగదు

- పరీక్షా పేపర్లో ఘోర తప్పిదాలు అవాస్తవం
- పరీక్షల నిర్వహణ ఇన్చార్జ్ అధికారిణి డాక్టర్ కావ్య జ్యోత్స్న

**నవతరం-ఎచ్చెర్ల**



యూనివర్సిటీ క్రెడిబిలిటీని, ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి విద్యార్థుల భవిష్యత్తు నాశనం చెయ్యాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరీక్షల నిర్వహణ ఇన్చార్జ్ అధికారిణి డాక్టర్ కావ్య జ్యోత్స్న అన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం లాంటి వెనుకబడిన జిల్లాలకు వరం ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయమని, పీజీ సెంటర్ తో మొదలైన విద్యా ప్రస్థానం విశ్వవిద్యాలయం వరకు వ్యాప్తి చెందిందని, ఉన్నత విద్యలను అభ్యసించడానికై విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ, ఇతర విశ్వవిద్యాలయాలపై ఆధారపడిన శ్రీకాకుళం యువతకు ఎచ్చెర్ల యూనివర్సిటీ ఒక ఆశా కిరణంగా ఎదిగిందని ఆమె అన్నారు. ఎన్నో వడిదుడుకులు దాటుకొని సాంకేతిక విద్యను సైతం గ్రామీణ విద్యార్థులకు చేరువ చేసిన విశ్వవిద్యాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపై ఉందని, విశ్వవిద్యాలయం ప్రతిష్టకు భంగం కలిగించే ఎటువంటి చర్యను ఉపేక్షించేది లేదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలే నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో బిజినెస్ అనలిస్టు స్కిల్స్ పరీక్షలో తీవ్రమైన లోపాలు అంటూ ఒక పత్రిక ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. పరీక్షా పేపర్లో ఘోర తప్పిదాలు అనేది పూర్తిగా అవాస్తవమని, ఇటువంటి కథనాలతో విద్యార్థులను గందరగోళానికి గురిచేయడం తగదని హితవు పలికారు. ప్రశ్నపత్రం తయారీ అనేది పూర్తిగా సంబంధిత అధ్యాపకుల కాన్ఫిడెన్సియల్ ఎక్స్టనల్ పేపర్ సెట్టర్ కమిటీ తయారు చేస్తుందని, ప్రశ్న సరళినీ మారుస్తూ మూడు రకాల ప్రశ్న పత్రాలను సిద్ధం చేస్తారన్నారు. ఎక్కడైనా ప్రశ్నల పత్రలలో పొరపాట్లు గుర్తించినట్లయితే ప్రత్యామ్నాయ పత్రాన్ని పంపిణీ చేసి, పీజీ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్చార్జ్ అధికారిణిగా బాధ్యత వహిస్తానని డా. కావ్య జ్యోత్స్న పేర్కొన్నారు. పీజీ పరీక్ష నిర్వహణ లోపాలు ఉంటే తప్పకుండా వాటిని సరిదిద్దుకొని వెళ్తామని, ఇటివలే ఇంచార్జిగా బాధ్యతలు తీసుకోవడంతో ఏమైనా పరీక్ష నిర్వహణ లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్థానని ఆమె వివరించారు.

# అస్థిత్వాన్ని చాటుకున్న ప్రసార సాధనం రేడియో

**నవతరం -శ్రీకాకుళం**

అనాదిగా మనందరితో పెనవేసుకున్న ఆత్మబంధం రేడియో ఒక్కటి మాత్రమేనని, తరతరాల అంతరంతో వెల్లువలా వచ్చి పడ్డ ప్రసార సాధనాల హోరులో పోటీని తట్టుకుని అస్తిత్వాన్ని చాటుకుంటున్న రేడియోకు ప్రత్యామ్నాయం లేదని విశ్రాంత జిల్లా అధికారి, న్యాయవాది వావిల పల్లి జగన్నాథ నాయుడు అన్నారు.ప్రపంచ రేడియో దినోత్సవంగా ఆకాశవాణి(ప్రసార భారతి) జిల్లా ప్రతినిధిగా సేవలందిస్తున్న శాసపు జోగినాయుడును అతని నివాసంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. దుశ్శాలువను కప్పి స్మరణికను అందజేశారు. మూడు దశాబ్దాల పాటు పాత్రికేయ వృత్తిలో ఉంటూ జిల్లా ప్రగతిని ఆకాశవాణి ద్వారా ప్రపంచానికి చాటి చెబుతున్న ఘనత జోగినాయుడుకు దక్కుతుందని జగన్నాథ నాయుడు కితాబునిచ్చారు.ఈ ప్రక్రియను భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో కొనసాగించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కాలేజీలో ఉద్రిక్తత

- ఫీజుల వివాదంతో ప్రిన్సిపాల్-విద్యార్థుల మధ్య ఘర్షణ
- కొత్త జి.ఓ ప్రకారం పెంచిన ఫీజులు కట్టాలంటూ ఒత్తిడి
- ఫీజులు చెల్లించకపోతే పరీక్షలకు అనుమతి లేదని హెచ్చరిక
- మీడియా ప్రవేశంపై కాలేజీ యాజమాన్యం ఆంక్షలు
- అయోమయంలో విద్యార్థులు, ఆందోళన వ్యక్తం
- వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి జోక్యం కోరిన విద్యార్థులు

**నవతరం టెక్కలి**

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫీజుల వివాదం కారణంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన జి.ఓ నెం.118 (డిసెంబర్ 24, 2025) ప్రకారం 2023--24 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులు కూడా పెంచిన ఫీజులు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం సర్కులర్ జారీ చేయడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ప్రిన్సిపాల్‌ను కలిసిన విద్యార్థులను గట్టిగా మందలించడంతో పాటు వారిపై దాడి చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు వినిపించాయి. అనంతరం డైరెక్టర్ నాగేశ్వరరావును ప్రశ్నించేందుకు ప్రయత్నించిన విద్యార్థులతో వాగ్వివాదం చోటుచేసుకుంది. సమాచారం బయటకు రావడంతో కళాశాలకు చేరుకున్న మీడియాకు మొదట అనుమతి నిరాకరించిన యాజమాన్యం, తరువాత విద్యార్థులను సమావేశ మందిరంలోకి తీసుకెళ్లి పెంచిన ఫీజులు వెంటనే చెల్లించాల్సిన అవసరం లేదని, ఒకటి రెండు నెలల గడువు ఇస్తామని వివరణ ఇచ్చింది. అయితే విద్యార్థులు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

గత రెండు సంవత్సరాలకు సంబంధించిన ఫీజులు ఇప్పటికే చెల్లించినప్పటికీ అదనంగా పెంచి వసూలు చేయడం అన్యాయమని విద్యార్థులు వాపోతున్నారు. ఫీజులు చెల్లించకపోతే పరీక్షలకు అనుమతి ఇస్తారా లేదా అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పెంచిన ఫీజుల విషయాన్ని కుటుంబాలకు ఎలా తెలియజేయాలన్న ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు.






# రాష్ట్ర బడ్జెట్లో ఉద్దానానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**నవతరం -పలాస**

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం ప్రాంతమైన పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సాగునీరు తోపాటు త్రాగునీరు కొరత ఉందని, వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడం వల్ల, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడడం లేదని, రోజురోజుకు వలసలు పెరిగిపోతున్నాయని, ఈ నేపథ్యంలో వలసలు అరికట్టడానికి రాష్ట్ర బడ్జెట్లో ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేవలం వ్యవసాయ రంగం మాత్రమే కాదు, ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా నీటి వనరులు అత్యంత కీలకమన్నారు. నీరుంటే పంటలు పండుతాయి అని, నీరు లేకుండా పరిశ్రమల స్థాపన, వాటి మనుగడ కూడా అసాధ్యమన్నారు. సేవా రంగంలో రోడ్డు వెయ్యాలన్నా, భవనాలు నిర్మించాలన్నా నీరే కీలకమని బమ్మిడి దుర్యోధన రావు విన్నవించారు. ఇంతటి ప్రాధాన్యత గల నీటి వనరుల అభివృద్ధికి ఉద్దానం ప్రాంతం నోచుకోలేదన్నారు. జిల్లాలో వంశధార నది జలాలు ఇచ్ఛాపురం నియోజకవర్గ శివారు ప్రాంతం వరకు వెళ్ళవలసి ఉందని, అయితే సాగునీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. వంశధార, ఆఫ్ షోర్, జల వనరుల శాఖ పరిధిలోని ప్రాజెక్టుల కోసం అవసరమైన నిధులు కేటాయించాలని వైయస్సార్సీపి ప్రభుత్వానికి ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తుందని, పాలకులు మాత్రం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, ప్రతి ఎకరాకు నీరు అందిస్తామంటూ పలు సందర్భాలలో హామీలు ఇచ్చినప్పటికీ, బడ్జెట్లో కేటాయింపుల దగ్గరకు వచ్చేసరికి నిరాశే మిగులుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది బడ్జెట్లో ఆఫ్ షోర్ ప్రాజెక్టు పనులు కోసం రూ. 167.68 కోట్లు అవసరమని ప్రతిపాదనలో ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం కేవలం రూ 90.60 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్లో చూపించినప్పటికీ, పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయని బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు. అదేవిధంగా పలాస నియోజకవర్గం తో పాటు సరిహద్దు ప్రాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మహేంద్ర తనయ నదీ జలాలు సద్వినియోగం జరిగితే,అనేక వందలాది ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని, కళింగ దళ్, డబారు సింగ్, వరహాలు గడ్డ, బీల బట్టి, దేశి బట్టి, పైడిగం ప్రాజెక్టు ఆధునికరణ, బహుద నదీ జలాలు సద్వినియోగం తోపాటు మరికొన్ని జల వనరులు సమకూర్చుకోవడానికి ఆధునికరణ పనులు కోసం ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ప్రధానంగా ఉద్దానం కిడ్నీ వ్యాధి నియంత్రణలో భాగంగా డాక్టర్ వైయస్సార్ సుజల ధార పేరుతో రూ. 700 కోట్ల రూపాయలు వ్యయముతో హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు వంశధార జలాలు ఇంటింటా ప్రజలకు శుద్ధిచేసి సరఫరా చేసే ప్రాజెక్టు పనులు దాదాపు 90 శాతం పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తయినప్పటికీ, కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధి చేయబడిన జలాలు అందించాలని ఆయన కోరారు.

అలాగే మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసలుపోకుండా, స్థానికంగానే మత్స్య సంపద వేట నిమిత్తం నువ్వల రేవు వద్ద గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో మంజూరు చేసిన ఫిషింగ్ హార్బర్ తక్షణం నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని బమ్మిడి దుర్యోధనరావు కోరారు. ముఖ్యంగా ఉద్దాన ప్రాంత ప్రజలకు జీవనాధారమైన జీడి, కొబ్బరి పంటలు మరింత ఉత్పాదక దిశగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక బోర్డు నెలకొల్పాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన లో భాగంగా పలాస జిల్లాను తెరమీదకి తీసుకువచ్చి, ఇక్కడ ప్రజల్లో ఎన్నో ఆశలు కల్పించి, తీరా ప్రభుత్వం హ్యాండ్ ఇచ్చిన సంగతి గుర్తుపెట్టుకుని , త్వరలో పలాస జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**